క్లుప్తంగా

ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసిన సంభాని



ఉత్తమ్‌కు శుభాకాంక్షలు చెబుతున్న చంద్రశేఖర్

సత్తుపల్లి: తెలంగాణ కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సభ్యుడిగా నియమితులైన ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన గృహంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసిన సంభాని ఉత్తమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

తుమ్మల, రాయల మాటామంతి!



మాట్లాడుతున్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు

ఖమ్మం మయూరిసెంటర్: మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మంలో గురువారం జరిగిన పలు వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొనగా... అదే కార్యక్రమానికి పీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు కూడా వచ్చారు. పరస్పరం ఎదురుపడిన వారు కరచాలనం చేసుకుని మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో పాలేరు నుంచి కాంగ్రెస్ టికెట్ రాయల నాగేశ్వరరావు ఆశిస్తుండగా.. తుమ్మల కాంగ్రెస్‌లో చేరతారన్న ప్రచారంతో ఆయన సైతం పాలేరు నుంచే పోటీ చేయనున్నట్లు అనుచరులు చెబుతున్నారు. ఈనేపథ్యాన ఇద్దరు ఎదురుపడి మాట్లాడుకోవడాన్ని నాయకులు ఆసక్తిగా పరిశీలించారు.

11నుంచి అంగన్‌వాడీల సమ్మె



సమావేశంలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

చింతకాని: సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈనెల 11నుంచి నిర్వహించే అంగన్‌వాడీ టీచర్ల సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ సీతామహలక్ష్మి కోరారు. మండలంలోని నాగులవంచలో గురువారం జరిగి సమావేశంలో వారు మాట్లాడుతూ గత 48 ఏళ్లగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తమ సేవల ద్వారా ఐసీడీఎస్‌ను అగ్రభాగాన నిలబెట్టారని తెలిపారు. అయితే, మంత్రి సత్యవతి రాథోడ్ ఇటీవల జరిపిన చర్చల్లో ఇచ్చిన ఏ హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. అంతేకాక ఉద్యోగ విరమణ తర్వాత ఇస్తామన్న నగదు కూడా సరిపోదని పేర్కొన్నారు. ఈమేరకు సమస్యల పరిష్కారం చేపడుతున్నట్లు సమ్మెలో అంగన్‌వాడీ ఉద్యోగులందరూ పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా ఖమ్మం రూరల్ ప్రాజెక్టు పరిధిలోని నాగులవంచ సర్కిల్‌కు చెందిన పలువురు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు బీఆర్‌టీయూ నుంచి ఏఐటీయూసీలో చేరారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, కవిత, మంగమ్మ, మణి, సావిత్రి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

మొర్రేడు వాగులో పడి వృద్ధుడి మృతి



ధర్మయ్య(ఫైల్)

పాల్వంచ: ప్రమాదవశాత్తు మొర్రేడు వాగులో పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం ... బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని బంగారు జాల గ్రామానికి చెందిన బాడిశ ధర్మయ్య(95) ఆరోగ్యం బాగోలేక పోవడంతో పాత పాల్వంచ వైద్యుని దగ్గరకు వచ్చి మందులు తీసుకుని తిరిగి ఇంటికి వెళుతున్నాడు. ఈ క్రమంలో కాలు జారి మొర్రేడులో పడి కొంత దూరం కొట్టుకుపోయాడు. అటుగా వెళుతున్న కూలీలు గుర్తించి బయటకు తీశారు. అయితే అప్పటికే మృతి చెందాడు. మృతునికి భార్య సుక్కమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు. గురువారం నివాస గృహంలో మృతదేహాన్ని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జమ్ముల సీతారామి రెడ్డి, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకుడు నిమ్మల రాంబాబు సందర్శించి నివాళులు అర్పించారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,026

జో అచ్యుతానంద..

- రామాలయంలో వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు
- కొనసాగుతున్న శ్రీమద్భాగవత సప్తాహ హవనం



స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: 'లాలిజో కృష్ణా.. లాలిజో.. జో అచ్యుతానంద.. జోజో ముకుందా..' అంటూ ఆస్థాన పండితులు ఆలపించిన లాలలు జోలలతో శ్రీకృష్ణావతారంలో ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి పరమానందభరితుడయ్యాడు. బేడా మండపంలో ఊయలలో వేంచిసియున్న స్వామివారిని చూసి భక్తులు పరవశించిపోయారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శ్రీ సీతారామచంద్రస్వామి వారి సన్నిధిలో గురువారం వైభవంగా ఊంజల్ సేవ నిర్వహించారు. శ్రీ వైష్ణవ సంప్రదాయం ప్రకారం ఆలయంలో వేడుకలు జరిపించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. కృష్ణాష్టమి సందర్భంగా స్వామివారిని శ్రీ కృష్ణావతారంలో అలంకరించి మేళతాళాలు, భక్తుల నామస్మరణల నడుమ పల్లకీలో తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. సాయంత్రం దర్బార్ సేవ నిర్వహించిన అనంతరం స్వామివారిని ఊయలలో పరుండబెట్టి ఊంజల్ సేవ జరిపించగా.. ఆస్థాన విద్వాంసులు, పండితులు జోలలు.. లాలలు పాడారు. అంతకుముందు స్వామివారికి పంచామృతాలతో ప్రత్యేకంగా అభిషేకం చేశారు. తొమ్మిది రకాల ప్రసాదాలను నివేదన చేశారు. ఈ సందర్భంగా స్థానాచార్యులు కేఈ స్థలశాయి భాగవతంలోని శ్రీ కృష్ణ జనన ఘట్టాన్ని భక్తులకు వివరించారు. వేడుకల్లో భాగంగా శుక్రవారం దేవస్థానం ఆధ్వర్యంలో ఉట్ల పండుగ నిర్వహించనున్నారు. కాగా, భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో శ్రీమద్భాగవత సప్తాహం కొనసాగుతోంది. చిత్రకూట మండపంలో అర్చకులు, వేద పండితులు శ్రీమద్భాగవత పారాయణం, ప్రవచనాలను భక్తులకు వినిపించారు.

కనులపండువగా నిత్యకలాణం..

ఆలయ ప్రాంగణంలోని ప్రాకార మండపంలో స్వామివారి నిత్యకల్యాణ వేడుక కమనీయంగా జరిగింది. శ్రీ సీతారామచంద్రస్వామి వారి మూల మూర్తులకు అంతరాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ప్రాకార మండపంలో స్వామివారిని ఆశీనులను చేసి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తుల గోత్ర నామాలను స్వామివారికి విన్నవించారు.



స్వామివారికి కుంభ హారతి ఇస్తున్న అర్చకులు

తెలంగాణలోనే కుల వృత్తులకు గుర్తింపు

సత్తుపల్లిరూరల్: తెలంగాణ ఏర్పాటైన్దాకే కుల వృత్తులకు గుర్తింపు లభించిందని సత్తుపల్లి జెడ్పీటీసీ కూసంపూడి రామారావు తెలిపారు. మండలంలోని కాకర్లలో గురువారం ఆయన సర్పంచ్ కంచర్ల రమాదేవితో కలిసి తొమ్మిది గొర్రెల యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఇంటికి సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించడమే బీఆర్‌ఎస్ లక్ష్యమని తెలిపారు. కులవృత్తిదారులు గొర్రెల యూనిట్లను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు సాహిత్య, గంధార్, ఎంపీటీసీ నాగార్జున పుష్పావతితో పాటు నాయకులు దేవరపల్లి సత్యనారాయణ, పరిమి వెంకటేశ్వరరావు, కొప్పుల రమేష్, తుర్లపాటి నాగేశ్వరరావు, కంచర్ల నాగయ్య, కె.నాగేశ్వరరావు, కొత్తపల్లి నర్సింహారావు, చెన్నారావు, కృష్ణారావు, కృష్ణ, పప్పారావు, నాగరాజు, చెన్నారావు పాల్గొన్నారు.

న్యూలక్ష్మీపురంలో..

ముదిగొండ: ముదిగొండ మండలంలోని న్యూలక్ష్మీపురంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యాన రెండో విడత గొర్రెల పంపిణీని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 18మంది లబ్ధిదారులకు సర్పంచ్ వాకగాని కన్నయ్య గొర్రెల యూనిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాధవి, మండల పశువైద్యాధికారి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లి రూరల్: కాకర్లపల్లిలో గొర్రెలు అందజేస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్



ముదిగొండ : న్యూలక్ష్మీపురంలో యూనిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి హారతి, మంత్రపుష్పం, నివేదన సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎస్.రజనీకుమారి, అర్చకులు, వేద పండితులు పద్మనాభశర్మ, రవికుమార్ శర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు మహిపతి రామలింగం, సభ్యులు గంధం వెంగళరావు పాల్గొన్నారు.



పెద్దమ్మతల్లికి పుష్పార్చన చేస్తున్న అర్చకులు

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

ఖమ్మంసహకారనగర్/నేలకొండపల్లి/తిరుమలాయపాలెం/కూసుమంచి/కామేపల్లి(కారేపల్లి): ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారత్ జోడో యాత్రకు ఏడాది పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు గురువారం వేడుకలు నిర్వహించారు. ఈమేరకు ఖమ్మంలోని మయూరి సెంటర్ నుంచి జెడ్పీ అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్ర చేపట్టారు. అలాగే, నేలకొండపల్లి, కూసుమంచిలో టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు కేక్ కట్ చేసి రాజీవ్‌గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇక తిరుమలాయపాలెంలో పార్టీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్ కేక్ కట్ చేశారు. భారత్ జోడోయాత్రకు సంఘీభావంగా కామేపల్లి మండలం మద్దులపల్లిలో నాయకులు పాదయాత్ర నిర్వహించారు. ఈకార్యక్రమాల్లో కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, మహ్మద్ జావీద్, నాయకుడు మువ్వా విజయ్‌బాబు, రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ యాత్ర తర్వాత కాంగ్రెస్ పార్టీని దేశం, రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి తీసుకురావాలని ప్రజలు నిర్ణయించుకున్నారని తెలిపారు. ఈమేరకు పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు పుచ్చకాయల వీరభద్రం, కొత్తా సీతారాములు, యడ్లపల్లి సంతోష్, బేబీ స్వర్ణకుమారి, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, అమర్జహాన్ బేగం, దొబ్బల సౌజన్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, చోటా బాబా, మొక్కా శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, జెర్రిపోతుల అంజిని, రేగూరి హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంసహకారనగర్ : ఖమ్మంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

బాలసాని అలక!

- భద్రాచలం నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమావేశాలకు దూరం
- ఇన్‌చార్జ్ తాతా మధును కలిసేందుకు విముఖత
- అంటీముట్టనట్టుగా ఉంటున్న లక్ష్మీనారాయణ వర్గం
- తుమ్మలతో కలిసి ప్రయాణిస్తారంటూ ఊహాగానాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో సీనియర్ రాజకీయ నాయకుడు, మూడుసార్లు ఎమ్మెల్సీగా పనిచేసిన బాలసాని లక్ష్మీనారాయణ అలకబూనారు. ప్రస్తుతం భారత రాష్ట్ర సమితిలో కొనసాగుతున్న బాలసాని.. ఇటీవల పార్టీ కార్యక్రమాల పట్ల అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా సొంత నియోజకవర్గమైన భద్రాచలం విషయంలో పార్టీ అనుసరిస్తున్న తీరుతో ఆయన కినుక వహించినట్టు సమాచారం.

మీటింగ్‌కు డుమ్మా

రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి భద్రాచలం స్థానానికి డాక్టర్ తెల్లం వెంకట్రావును బీఆర్‌ఎస్ పార్టీ ఎంపిక చేసింది. అయితే కొన్ని నెలల క్రితమే బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన వెంకట్రావు.. టికెట్ల ప్రకటనకు రెండు వారాల ముందు తిరిగి గులాబీ గూటికి చేరి టికెట్ దక్కించుకున్నారు. తెల్లం పార్టీని వీడడంతో బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపిన ఇతర నేతలకు ఈ అంశం మింగుడుపడటం లేదు. దీంతో నిత్యం అసమ్మతిగళం వినిపిస్తూ వస్తున్నారు. దీంతో ఇటీవల నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులైన ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు భద్రాచలంలో ప్రచార కార్యక్రమాన్ని భారీ ఎత్తున ప్రారంభించేందుకు సన్నాహాలు చేశారు. అయితే చివరి నిమిషంలో ఈ కార్యక్రమం వాయిదా పడింది. దీంతో నియోజకవర్గంలోని భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాలకు చెందిన నాయకులతో బూర్గంపాడులో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బాలసాని లక్ష్మీనారాయణ హాజరు కాలేదు. అంతేకాక ఆయనకు పట్టున్న వాజేడు, వెంకటాపురం మండలాల నాయకులు కూడా రాలేదు. కేవలం భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం నాయకులతోనే సమావేశాన్ని మమా అనిపించారు.



బాలసాని లక్ష్మీనారాయణ

బాలసానికి ఉక్కపోత

టీడీపీలో ఉన్నప్పటి నుంచి భద్రాచలం నియోజకవర్గంలో బాలసాని లక్ష్మీనారాయణ ప్రముఖ నేతగా ఉంటూ వస్తున్నారు. టీడీపీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరినా ఈ నియోజకవర్గంపై తనదైన ముద్ర కొనసాగిస్తూ వచ్చారు. గతేడాది కాలంగా పార్టీ కార్యక్రమాలకు తెల్లం వెంకట్రావు దూరంగా ఉన్న సమయంలోనూ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఆత్మీయ సమావేశాల నిర్వహణ బాధ్యతలు చూశారు. అయితే రాజకీయ వ్యూహంలో భాగంగా బీఆర్‌ఎస్ పార్టీ వేగంగా పావులు కదిపి కాంగ్రెస్‌లో చేరిన తెల్లం వెంకట్రావును తిరిగి సొంతగూటికి తీసుకొచ్చింది. ఈ వ్యవహారంలో బాలసానికి పెద్దగా పాత్ర దక్కలేదు. పైగా తెల్లంను అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలను పార్టీ తాతా మధుకు అప్పగించింది. తన ప్రమేయం లేకుండా నియోజకవర్గంలో చకచకా మార్పులు జరిగిపోతుండడం బాలసానికి ఇబ్బందిగా మారిందని ఆయన అనుచర వర్గాలు అంటున్నాయి.

తుమ్మలతో వెళ్తారా?

బాలసాని లక్ష్మీనారాయణ సుదీర్ఘకాలం టీడీపీలో కొనసాగారు. మాజీమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుచరుడిగా భద్రాచలం నియోజకవర్గంలో చక్రం తిప్పారు. తాజాగా కారు గుర్తుపై పాలేరు నుంచి పోటీచేసే అవకాశం దక్కకపోవడంతో తుమ్మల అసంతృప్తితో ఉన్నారు. తమ పార్టీలోకి రమ్మంటూ తుమ్మలను కాంగ్రెస్ తరఫున రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి వంటి రాష్ట్ర స్థాయి నేతలు ఆహ్వానించారు. దీంతో హస్తం పార్టీలోకి తుమ్మల వెళ్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో భద్రాచలం నియోజకవర్గానికి సంబంధించి పార్టీ కార్యక్రమాల పట్ల అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్న బాలసాని కూడా తన రాజకీయ గురువు తుమ్మల బాటలో నడుస్తారా అనే చర్చ గోదావరి తీర ప్రాంత మండలాల్లో జరుగుతోంది.

హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక



తల్లాడకు చెందిన హితేష్



ఎంపికైన కల్లూరు విద్యార్థులతో పీఈటీ

కల్లూరు/తల్లాడ: హైదరాబాద్‌లోని హకీంపేటలోని క్రీడా పాఠశాలకు సత్తుపల్లి నియోజకవర్గం నుంచి ఐదుగురు ఎంపికయ్యారు. ఈ పాఠశాలలో నాలుగో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉచితంగా విద్య అందిస్తూ వసతి కల్పించడమే కాక క్రీడల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దుతారు. ఈమేరకు జిల్లా నుంచి 32మంది విద్యార్థులు ఎంపిక పోటీల్లో పాల్గొనగా, 14 మంది ఎంపికయ్యారు. వీరిలో కల్లూరు మండలం నుంచి ఐదుగురికి, తల్లాడ మండలం నుంచి ఒకరికి అవకాశం దక్కింది. కల్లూరు మండలం నుంచి ఎంపికైన కె.పృథ్విని, జి.కుశాల్, బి.షైనీ, ఎం.ఉమామహేశ్వరి, మోక్షిత్‌ను గురువా రం పీఈటీ పసుపులేటి వీరరాఘవయ్య, పీడీ తప్పెట లక్ష్మీనర్సయ్యతో పాటు పీ.వీ.సత్యనారాయణరెడ్డి, వై.రజిత, సీహెచ్.త్రివేణి, కంద్రాతి రాధాకృష్ణ, విజయకుమారి తదితరులు అభినందించారు. అలాగే, తల్లాడ బాలభారతి విద్యాలయానికి చెందిన కోటగిరి హితేష్ శ్రీరంగా ఎంపిక కాగా, ఆయనను ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్, పాఠశాల యాజమాన్య బాధ్యులు అభినందించారు.

ఇది రాచరికం కాదు.. ప్రజాస్వామ్యం

ఎమ్మెల్సీ తాతా మధు

అశ్వారావుపేటరూరల్: ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థులను అసెంబ్లీ గేటు తాకనివ్వనని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కొన్నాళ్ల క్రితం చేసిన వ్యాఖ్యలు అహంకారంతో చేసినవేనని బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుతో కలిసి స్థానిక క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇది రాజుల కాలం కాదు, ప్రజాస్వామ్యం అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. కాగా, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీనియర్ నాయకుడని, ఆయన విషయంలో తానేమీ వ్యాఖ్యానించనని అన్నారు. సీఎం కేసీఆర్ ఆయనకు ఎలాంటి గౌరవం ఇచ్చారో అందరికీ తెలుసన్నారు. సీఎం కేసీఆర్ స్థాయిలోనే ఆయనతో చర్చిస్తున్నట్లు తెలిపారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన నేపథ్యాన ఆయనను మరోసారి గెలిపించాలని కోరారు. నాలుగున్నర ఏళ్లలో ఎమ్మెల్యేగా రూ.200 కోట్ల నిధులు తీసుకురావడంతో పాటు 100 పడకల ఆస్పత్రి, డిగ్రీ కళాశాల, అన్ని మండలాల్లో సెంట్రల్ డివైడర్లు, లైటింగ్ మంజూరు చేయించారని తెలిపారు. తొలుత నాగేశ్వరరావును ఎమ్మెల్సీ మధు సన్మానించారు. ఈ సమావేశంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, బీఆర్‌ఎస్ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, ప్రకాశ్‌రావు, సత్యవరపు సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధు, పక్కన ఎమ్మెల్యే మెచ్చా

ఒక్కసారి గెలిపిస్తే అభివృద్ధి చేస్తా...



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, నాయకులు

జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్

ఎర్రుపాలెం: మధిర నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేగా మల్లు భట్టి విక్రమార్కను మూడుసార్లు గెలిపించినా చేయలేని అభివృద్ధిని... తనను ఒకసారి గెలిపిస్తే చేసి చూపిస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ వెల్లడించారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో వివిధ గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా కమల్‌రాజ్ మాట్లాడుతూ మాజీ మంత్రి శీలం సిద్దారెడ్డి బనిగండ్లపాడుకు ప్రభుత్వాస్పత్రిని మంజూరు చేయిస్తే అది శిథిలావస్థకు చేరినా భట్టి విక్రమార్క పట్టించుకోలేదని తెలిపారు. తాను మాత్రం వైద్య, ఆరోగ్య శాఖ మంత్రితో మాట్లాడి కొత్త భవనం నిర్మాణానికి రూ.1.60 కోట్లు మంజూరు చేయించానని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని రీతిలో సంక్షేమ పథకాలను అమలుచేస్తున్న సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించడంతో మధిర ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఆయన కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సత్కారం

మండలంలోని బనిగండ్లపాడు బీసీ కాలనీ పాఠశాల హెచ్‌ఎం జంగా గురునాథరెడ్డి జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ సన్మానించారు. ఈకార్యక్రమాల్లో మధిర ఏఎంసీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, ఎంపీపీ దేవరకొండ శిరీష, సర్పంచ్ మొగిలి అప్పారావు, బీఆర్‌ఎస్ మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పంబి సాంబశివరావు, యన్నం శ్రీనివాసరెడ్డితో పాటు నాయకులు, ప్రజాప్రతినిధులు చావా రామకృష్ణ, శీలం వెంకట్‌రెడ్డి, వేమిరెడ్డి బాలరాఘవరెడ్డి, కోట శ్రీనివాసరావు, మస్తాన్‌వలీ, కిశోర్, రామకోటేశ్వరరావు, కృష్ణారావు, నర్సింహ, శెట్టిపల్లి మదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారయత్నం కేసు నమోదు

బోనకల్: ఓ వివాహితపై అత్యాచారయత్నం జరిగిన ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని మోటమర్రికి చెందిన వివాహిత గురువారం పొలం వద్ద పని చేస్తుండగా, గ్రామానికే చెందిన కిరణ్ అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. దీంతో ఆమె కేకలు వేయగా చుట్టుపక్కల వారు రావడంతో పారిపోయాడు. అనంతరం బాధిత మహిళ తన భర్తతో కలిసి పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సాయికుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా రెండు కుటుంబాల నడుమ పొలాలకు సంబంధించి గొడవలు ఉన్న నేపథ్యాన ఈ ఘటన జరిగి ఉండొచ్చనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మధిర: గూడ్స్ రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి(30) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధిర జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి వెల్లడించిన వివరాలు... మధిర-మోటమర్రి రైల్వేస్టేషన్ల మధ్య డౌన్‌లైన్‌లో వెళ్తున్న గూడ్స్ రైలు కింద పడి సదరు వ్యక్తి గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో మృతదేహాన్ని మధిర ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుడి ఆచూకీ తెలిస్తే 99636 41484 నంబర్‌లో సంప్రదించాలని వేణుగోపాల్‌రెడ్డి సూచించారు.

ఆటోడ్రైవర్ అదృశ్యం



వెంకటేష్

ఏన్కూరు: ఆటోడ్రైవర్ అదృశ్యమైన ఘటనపై గురువారం కేసు నమోదైంది. మండలంలోని గార్లఒడ్డు గ్రామానికి చెందిన గుగులోతు వెంకటేష్(32) ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన ఆయన తరచుగా భార్య అరుణతో గొడవపడేవాడు. గతనెల 8న కూడా భార్యతో గొడవపడిన వెంకటేష్ ఆటోతో తీసుకుని వెళ్లిపోయాడు. ఇప్పటివరకు తిరిగి రాకపోవడం, ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో ఆయన భార్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాదావత్ రవి తెలిపారు.

గోశాలకు గోవుల తరలింపు




పోలీసులు పట్టుకున్న పశువులు

భద్రాచలంఅర్బన్/పాల్వంచ: ట్రాలీ వాహనా ల్లో అక్రమంగా తరలిస్తున్న గోవులను పోలీసులు పట్టుకుని గురువారం పాల్వంచలోని గోశాలలో అప్పగించారు. చర్ల నుంచి మోరంపల్లి తరలిస్తున్న నాలుగు పశువులను, చర్ల నుంచి కారేపల్లి సంతకు తరలిస్తున్న మూడు పశువులను భద్రాచలంలో పోలీసులు పట్టుకున్నారు. నలుగురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పీవీఎన్‌రావు తెలిపారు. ఏపీ సరిహద్దు ఎటపాక పోలీసులు మరో 11 పశువులను పట్టుకున్నారు. వీటిని సంరక్షణ నిమిత్తం పాల్వంచ గోశాలలో అప్పగించారని అన్నపూర్ణ గో సంరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి ఆంజనేయ శర్మ తెలిపారు.

లకారం.. ఆహ్లాదం

గతంలో మట్టి, పిచ్చి చెట్లతో ఉన్న లకారం చెరువును ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దారు. ఇప్పుడు లకారం ట్యాంక్‌బండ్ పిక్నిక్ స్పాట్‌గా మారింది. తీగల వంతెన, ఓపెన్‌జిమ్, ఫుడ్‌కోర్టులు, రోప్ సైక్లింగ్, బోటింగ్, పిల్లలు ఆడుకునేందుకు అన్ని రకాల వసతులతో ఏర్పాటు చేశారు. లకారం ఆధునికీకరణ పనులకు రూ.34.65 కోట్లు వెచ్చించారు.





లకారం చెరువుపై ఏర్పాటు చేసిన తీగల వంతెన



లకారం చెరువు
నాడు
నేడు

అభివృద్ధికి అడ్డా.. ఖమ్మం

తెలంగాణ ఏర్పడిన తొమ్మిదేళ్లలో ఖమ్మం నగరం రూపురేఖలు మార్చుకుంది. ప్రధానంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో ఖమ్మంను భాగ్యనగరం తర్వాత అంతటి స్థాయిలో అభివృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషించారు. గడిచిన తొమ్మిదేళ్లలో రూ.2వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తిచేయగా, మరిన్ని పనులకు ఇంకో రూ.వెయ్యి కోట్లు మంజూరయ్యాయి. మొత్తంగా రూ.3వేల కోట్ల వ్యయంతో చేపట్టిన, చేపడుతున్న పనులతో 2014 కంటే ముందు.. ఇప్పుడు ఖమ్మంను చూస్తే మార్పును తెలుసుకోవచ్చు. ప్రతీ రంగంలోనూ అభివృద్ధి స్పష్టంగా గోచరిస్తోంది. గత కొన్నేళ్లలోనే ఖమ్మం నగరం విస్తరించింది. అద్భుతమైన రోడ్లు, కూడళ్లు, వీధిదీపాలు, నగరానికే తలమానికంగా లకారం ట్యాంక్‌బండ్, గోళ్లపాడు చానల్ ఆధునికీకరణ, కొత్త కలెక్టరేట్, కొత్త కార్పొరేషన్ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా, నగరంలో సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్, డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు, ఐటీహబ్, అద్భుతంగా తీర్చిదిద్దిన వైకుంఠధామాలు, ధంసలాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి, బస్తీ దవాఖానాల ఏర్పాటుతోనే కాక మెడికల్ కళాశాల మంజూరుతో ఖమ్మంకు కొత్త శోభ వచ్చిందని ఎవరైనా ఒప్పుకుని తీరాల్సిందే!

– ఖమ్మంమయూరిసెంటర్

మంత్రి పువ్వాడ చొరవతో హంగులు


- మహానగరాలకు దీటుగా ఖమ్మం
- నియోజకవర్గమంతా మెరిసేలా రోడ్లు..
- ఆహ్లాదానికి ట్యాంక్ బండ్, పార్కులు
- యువత ఉపాధి కోసం ఐటీ హబ్
- మురుగు బాధ నుంచి గోళ్లపాడుకు విముక్తి
- రూ.2వేల కోట్ల విలువైన పనులు పూర్తి.. మరో రూ.వెయ్యి కోట్ల నిధులు రెడీ

2014కు ముందు ఖమ్మంలో 25,534 నల్లా కనెక్షన్లు ఉండేవి. కానీ అవి 73,318 కు చేరాయి. పైపులైన్లు ఇతరత్రా పనులకు రూ.23.89 కోట్లు వెచ్చించగా.. ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందుతోంది. అలాగే, రూ.264 కోట్లతో చేపట్టిన మిషన్ భగీరథ పనులు పూర్తయిన నేపథ్యాన ఇంటినుంచి కాలు బయట పెట్టకుండానే నీటి సరఫరా జరుగుతోంది.



మిషన్ భగీరథ నల్లాను ప్రారంభించిన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం - వైరా రోడ్ నుంచి వెంకటాయపాలెం ప్రధాన రహదారి



కార్పొరేషన్ పరిధిలో..

ఖమ్మం నగరంలో ఎక్కడ చూసినా డబుల్ లేన్ రోడ్లు దర్శనమిస్తాయి. ప్రధాన రహదారుల పైనే కాకుండా అంతర్గత రహదారులను కూడా సీసీ రోడ్లు, వీడీఎఫ్ రోడ్లుగా వేశారు. 2014కు పూర్వం కార్పొరేషన్ పరిధిలో 400 కిలోమీటర్ల మేరకు ఈ రోడ్లు ఉండేవి. ప్రస్తుతం 1,115 కిలోమీటర్ల మేరకు సీసీ, వీడీఎఫ్ రోడ్లు విస్తరించాయి. ఇందుకోసం రూ.347.80 కోట్లు వెచ్చించారు. ఇక సైడ్ కాల్వలు 2014కు పూర్వం 205 కిలోమీటర్ల మేరకే ఉండగా.. ఇప్పుడు 1,592 కిలోమీటర్ల మేరకు సైడ్ డ్రెయిన్ల నిర్మాణం పూర్తయింది. ఇందుకోసం రూ.448.66 కోట్లు వెచ్చించారు. 2014కు పూర్వం ఏడు వాటర్‌ట్యాంకులు ఉండగా.. ఇప్పుడు 27కు చేరాయి. వీటి నిర్మాణం కోసం రూ.8 కోట్లు ఖర్చు చేశారు. చెత్తను తొలగించే పారిశుద్ధ్య వాహనాలు 2014 కంటే ముందు 14 మాత్రమే ఉండగా.. ఇప్పుడు వాటి సంఖ్య 143కు చేరింది. ఇందుకోసం రూ.18 కోట్లు ఖర్చు చేశారు. నగరమంతా వీధిదీపాలతో కళకళలాడుతోంది. నగరంలో 2014లో 12,254 వీధిదీపాలు ఉండగా.. ఇప్పుడు 21,946 వీధిదీపాలు నగరంలో ఉన్నాయి. ఇందుకోసం రూ.7.75 కోట్లు ఖర్చు పెట్టారు.



నగరంలో సెంట్రల్ లైటింగ్ తళుకులు

గోళ్లపాడు మురికి కాల్వ



నాడు

గోళ్లపాడు చానల్‌కు మహర్దశ


నగరంలోనే పెద్ద సమస్యగా ఉన్న గోళ్లపాడు చానల్‌కు మోక్షం లభించింది. గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ప్రాంతాన్ని సందర్శించి నిధులు విడుదల చేస్తామని ప్రకటించారు. అనంతరం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చొరవతో ఈ పనుల నిమిత్తం రూ.100 కోట్లు మంజూరు కాగా.. పూర్తిస్థాయిలో వెచ్చించి. గోళ్లపాడు చానల్ పై పార్కుల నిర్మాణం పూర్తి చేశారు. అలాగే మురుగునీరు, వర్షపు నీరు పోయేందుకు డ్రెయినేజీల నిర్మాణం పూర్తయింది. గతంలో ఎక్కడ బడితే అక్కడమురుగుతో దుర్వాసన వెదజల్లిన ఈ ప్రాంతంలో ఇప్పుడు అద్భుతమైన పార్కులు వెలిశాయి. పిల్లలు ఆడుకునేందుకు చక్కటి సదుపాయాలు కల్పించారు.



నేడు

గోళ్లపాడు చానల్‌పై ఏర్పాటు ఏసిన పార్కులో చెస్ బోర్డు

రూ.180 కోట్లతో తీగల వంతెన



నగరంలోని మున్నేరుపై రూ.180 కోట్లతో తీగల వంతెన నిర్మించనున్నారు. ఖమ్మం నగరంలో మున్నేరుపై ఉన్న పాతకాలం నాటి బ్రిడ్జి ఖమ్మం నుంచి హైదరాబాద్, వరంగల్, నల్లగొండ, మిర్యాలగూడ రాకపోకలకు వారధిగా నిలుస్తోంది. అయితే జనాభా పెరగడంతో ట్రాఫిక్ జామ్ అవుతుండడం... వెడల్పు తక్కువతో ప్రమాదాలు, వర్షాకాలంలో వరద ప్రమాదంగా మారుతంది. దీంతో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నూతన బ్రిడ్జి నిర్మాణ ఆవశ్యకతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఏడాది జనవరి 18న బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభలో ముఖ్యమంత్రి తీగల వంతెన మంజూరు చేస్తున్నట్లు ప్రకటించగా.. మంత్రి కృషితో మరుసటి రోజే నిధులు మంజూరయ్యాయి. హైదరాబాద్‌లోని దుర్గం చెరువు తరహాలో మున్నేరుపై నిర్మించే వంతెన 300 మీటర్లు కేబుల్‌పై నిలుస్తుంది. అలాగే 390 మీటర్లు బాక్స్ ఆకారంలో వయాడక్ట్ బ్రిడ్జి నిర్మించనున్నారు.

యువతకు ఉద్యోగ అవకాశాలు

నగర యువత సుదూర ప్రాంతాలకు, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన పనిలేకుండానే వారి విద్యార్హతలకు తగిన ఉద్యోగం ఇక్కడే సంపాయించుకునేలా నగరంలో ఐటీ హబ్ నిర్మాణం జరిగింది. రూ.27.50 కోట్ల నిధులతో ఈ ఐటీహబ్ నిర్మాణం పూర్తి చేసుకుంది. ఇక్కడ పలు కంపెనీలు పని చేస్తున్నాయి. జిల్లాకు చెందిన యువత ఇక్కడే పని చేస్తుండటం విశేషం. గతంలో రైలు వస్తుందంటే గేట్ వద్ద చాలా సమయం వేచి ఉండాల్సి వచ్చేది. రైలు వచ్చి... వెళ్లే వరకు ఎంత అత్యవసర పని ఉన్నా వేచి ఉండాల్సిందే. కానీ రూ.77 కోట్ల నిధులతో ధంసలాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో ఆ ఇబ్బందులన్నీ తొలగిపోయాయి.



ఐటీ హబ్

ఐటీ హబ్ సర్కిల్



రోడ్లు, జంక్షన్లు

రోడ్లు, జంక్షన్ల నిర్మాణంతో ఖమ్మంకు కొత్త కళ సంతరించుకుంది. నాలుగు లేన్ల రోడ్లు, వీధి దీపాలతో రాత్రి కూడా పగటిని తలపించేలా నగరం వెలుగులీనుతోంది. కూడళ్ల వద్ద జంక్షన్లు, ఫౌంటెన్లు, జాతీయ నేతల విగ్రహాలు ఏర్పాటు చేయడంతో అందంగా ముస్తాబైంది. అలాగే వీడీవోస్ కాలనీలో ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ అందుబాటులోకి వచ్చింది. ఒకేచోట అన్ని రకాల కూరగాయలు, మాసం దొరికేలా ఏర్పాటు చేశారు. ఈ మార్కెట్ కోసం రూ.8.73 కోట్లు ఖర్చు పెట్టారు. ఇక రూ.105 కోట్ల వ్యయంతో 2004 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. ఇందులో కొన్ని డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు పూర్తి కావడంతో లబ్ధిదారులకు అందజేశారు. అన్ని ఇళ్లు కూడా త్వరలోనే లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు.

రఘునాథపాలెంకు కొత్త రూపం

రఘునాథపాలెం మండలంలో గత కొన్నేళ్లుగా అభివృద్ధి కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. 2019–20 ఏడాదిలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద 129 పనులు నిర్వహించారు. ఇందులో రూ.5.04 కోట్లతో రఘునాథపాలెం మండలంలో సీసీ రోడ్లు ఏర్పాటు చేశారు. డీఎంఎఫ్‌టీ నిధుల కింద వివిధ గ్రామాలకు ఐదు రోడ్ల కోసం రూ.4 కోట్లు వెచ్చించారు. పీఎంజీఎస్‌వై–3 కింద 2020–21 ఏడాదిలో రఘునాథపాలెం మండలంలోని వివిధ గ్రామాల్లో రూ.15.73 కోట్లతో నాలుగు పనులను చేశారు. అలాగే సుడా నిధులతో రఘునాథపాలెంలో రూ.1.94 కోట్లతో రఘునాథపాలెం మండలంలోని 57 ప్రాంతాల్లో బీటీ రోడ్లు నిర్మించారు. అలాగే సుడా నిధులతో పార్క్, సెంట్రల్ లైటింగ్, డివైడర్స్, రోడ్‌వైడనింగ్, హైమాస్ట్ లైట్లను మంచుకొండ, రఘునాథపాలెం, వీవీ పాలెం గ్రామాల్లో ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ.8.65 కోట్లు వెచ్చించారు. గ్రామ పంచాయతీ నిధుల నుంచి 2020 నుంచి 2023 వరకు రఘునాథపాలెం మండలంలో 55 ప్రాంతాల్లో పీపీవీ, అడిషనల్ పీపీవీ, బీపీవీల నిర్మాణాలను రూ.3.09 కోట్లతో చేపట్టారు. ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు రఘునాథపాలెం మండలంలో జరుగుతున్నాయి.

సుడా పార్క్



విశాలంగా నూతన బస్టాండ్

దశాబ్దాల క్రితం నిర్మించిన పాత బస్టాండ్ ప్రస్తుత అవసరాలకు సరిపోవడం లేదు. బస్‌లు, ప్రయాణికుల రద్దీతో అవస్థలు తప్పడం లేదు. దీంతో ఈ బస్టాండ్ స్థానంలో ఎన్నెస్పీ క్యాంప్‌లో నూతన బస్టాండ్‌ను రూ.30 కోట్ల వ్యయంతో నిర్మించారు. ఇక్కడ 30 ప్లాట్‌ఫామ్‌లతో విశాలమైన ప్రాంగణంతో సకల సదుపాయాలతో ఉంది. అలాగే పాత బస్టాండ్‌ను ఆధునికీకరించి పల్లెవెలుగు బస్‌ల కోసం వినియోగిస్తుండటంతో పాత బస్టాండ్ ప్రాంతంలో పనుల నిమిత్తం వెళ్లే వారికి సౌకర్యవంతంగా ఉంది.



ఖమ్మం నూతన బస్ స్టేషన్

నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయం



నాడు

నూతన కార్పొరేషన్ కార్యాలయం

ఖమ్మంలోని నగర పాలక సంస్థ కార్యాలయం దశాబ్దాల క్రితం నిర్మించింది. ఇక్కడ సిబ్బందికి సరిపడా వసతులు లేకపోవడంతో ఎన్నెస్పీ క్యాంప్‌లో నూతనంగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని నిర్మించారు. మొత్తం 72,273 చదరపు అడుగుల్లో నిర్మించిన ఈ కార్యాలయం కోసం రూ.21 కోట్లు ఖర్చు చేశారు. దీంతో సిబ్బందికి, వివిధ పనుల నిమిత్తం వచ్చే వారికి ఈ కార్యాలయం సౌకర్యవంతంగా ఉంది.



నేడు

ఖమ్మం నగరంలోని నూతన కార్పొరేషన్ కార్యాలయం

కలెక్టర్ కార్యాలయం



నాడు

ఐడీఓసీతో పాలన ఏకీకృతం

రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం వద్ద అన్ని హంగులతో ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకేచోట ఉండేలా ఐడీఓసీ (సమీకృత జిల్లా అధికారుల సముదాయం) నిర్మాణం జరిగింది. ఒకేచోట అన్ని కార్యాలయాలు ఉండటంతో జిల్లావ్యాప్తంగా వచ్చే ప్రజలకు సౌకర్యవంతంగా మారింది. ఇందుకోసం రూ.53 కోట్లు వెచ్చించారు.



నేడు

నూతన కలెక్టరేట్ (ఐడీఓసీ)

మరిన్ని సదుపాయాలు

జిల్లా కేంద్రంలో వైకుంఠధామం సైతం అన్ని వసతులతో అందుబాటులోకి వచ్చింది. ఇందుకోసం రూ.9 కోట్లు ఖర్చు చేశారు. గతంలో పిచ్చిమొక్కల నడుమే కుటుంబీకుల అంత్యక్రియలు నిర్వహించేవారు. ఈక్రమంలో వారి ఆవేదన మరింత పెరిగేది. కానీ వైకుంఠధామం నిర్మాణంతో బంధువులు సేద తీర్చినట్లవుతోంది. ఇక నగరంలో వివిధ పార్కులను సుందరీకరించారు. పెద్దలు సేదతీరేందుకు ఆహ్లాదకరమైన వాతావరణంతోపాటు పిల్లలు ఆడుకునేలా ఆటవస్తువులను సమకూర్చారు. ఇప్పటికే దాదాపు ప్రతీ డివిజన్‌లో బస్తీ దవాఖానాలను అందుబాటులోకి వస్తున్నాయి. ఇప్పటి వరకు మొత్తం ఏడు బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశారు. దీంతో జిల్లా పెద్దాస్పత్రికి వెళ్లకుండానే వైద్యం అందుతోంది. అలాగే ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం జరిగింది. పబ్లిక్ టాయిలెట్లు 2014లో మూడు ఉంటే.. ఇప్పుడు 41 ఉన్నాయి. ఇక క్రీడాకారులకు అవసరైన అన్ని సదుపాయాలను క్రీడా ప్రాంగణాల్లో ఏర్పాటుచేశారు. క్రీడా ప్రాంగణాలకు వాల్‌పెయింటింగ్ వేయించారు. సర్దార్ పటేల్ స్టేడియంలో అత్యాధునిక టెన్నిస్ స్టేడియం అందుబాటులోకి రావడంతో జాతీయ స్థాయి పోటీలకు నిర్వహణకు మార్గం సుగమమైంది.

మున్నేరుకు ఇరువైపులా రూ.690 కోట్లతో రక్షణ

మున్నేటికి వరద వస్తే పరీవాహక ప్రాంతాలు ముంపునకు గురి కాకుండా ప్రభుత్వం ఆర్‌సీసీ వాల్ మంజూరు చేసింది. జూలై 27న మున్నేరుకు వచ్చిన వరదతో పరీవాహక ప్రాంత కాలనీలు ముంపునకు గురయ్యాయి. మళ్లీ భవిష్యత్‌లో ఇబ్బంది రాకుండా ఆర్‌సీసీ వాల్ నిర్మించాలని నిర్ణయించగా... కేబినెట్ సమావేశంలో ఆమోదముద్ర వేసి రూ.150 కోట్లు మంజూరు చేసింది. ఆతర్వాత సవరించిన అంచనాల మేరకు ప్రభుత్వం రూ.690.52 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో త్వరలోనే పనులు మొదలుకానున్నాయి. మున్నేరుకు ఇరువైపులా ఖమ్మంరూరల్ మండలం వైపు ఎనిమిది కి.మీ., ఖమ్మం వైపు ఎనిమిది కిలోమీటర్లు మొత్తం 16 కిలోమీటర్ల మేరకు కాంక్రీట్ వాల్ నిర్మిస్తే పరీవాహక ప్రాంతంలో ఉన్న ఇళ్లు సురక్షితంగా ఉండనున్నాయి.